అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు : ప్రభుత్వ విప్ ఐలయ్య

అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఐలయ్య

ఆలేరు రూరల్, మార్చి 20 : అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తామని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఇందిరమ్మ ఇండ్ల నమూనాపై మంతపురి గ్రామ లబ్ధిదారులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 4లక్షలా 52వేల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించిందన్నారు. సొంత స్థలాలు ఉన్నవారికి ముందుగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని చెప్పారు. ఆలేరు మండలంలో మంతపురిని పైలెట్ గ్రామంగా ఎంపిక చేసి నందున గ్రామంలో మొదటగా ఇండ్ల నిర్మాణం చేపట్టామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ హనుమంతరావు, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీఓ కృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఐనాల చైతన్య, హౌజింగ్ పీడీ విజయ్‌సింగ్, డీఈ శ్రీరాములు, తాసీల్దార్ అంజిరెడ్డి, ఎంపీడీఓ సత్యాంజనేయప్రసాద్ పాల్గొన్నారు.

దశల వారీగా ఇందిరమ్మ ఇండ్లు : ఎమ్మెల్యే సామేల్

మోత్కూరు : పాటిమట్లలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సామేల్, కలెక్టర్ హనుమంతరావు

మోత్కూరు, మార్చి 20 : అర్హులైన ప్రతి కుటుంబానికీ ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడం ప్రభుత్వ లక్ష్యమని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మండలంలోని పాటిమట్లలో కలెక్టర్ హనుమంతరావుతో కలిసి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సొంత ఇంటి సదుపాయం లేని ప్రతి పేదకు దశల వారీగా ఇందిరమ్మ ఇల్లు వసతి కల్పిస్తామన్నారు. కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంతోపాటు అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ పేలపుడి వెంకటేశ్వర్లు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎన్.విమల, మండల ప్రత్యేకాధికారి బి.యాదయ్య, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

మానాయికుంటలో ఇందిరమ్మ ఇండ్లకు శంకుస్థాపన

అడ్డగూడూరు : మండలంలోని పైలెట్ ప్రాజెక్ట్ గ్రామం మానాయికుంటలో ఇందిరమ్మ ఇండ్లకు ఎమ్మెల్యే సామేల్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైలెట్ గ్రామంలో 59ఇండ్లు మంజూరు చేశామని, 15 ఇండ్లకు శంకుస్థాపన చేశామని అన్నారు. మిగతా ఇండ్లకు ఈ నెల చివరలో శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ విమల, వైస్ చైర్మన్ నర్సిరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ నిరంజన్‌రెడ్డి, ఎంపీడీఓ శంకరయ్య, డీటీ సత్యనారాయణ, ఎంపీఓ ప్రేమలత, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు జోజి, నాయకులు పాల్గొన్నారు.

నిరుపేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

వలిగొండ, మార్చి 20 : నిరుపేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం 73మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని, బునాదిగాని కాల్వ మిగిలిన పనులను త్వరలో చేపడుతామని అన్నారు. తాసీల్దార్ పి.శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ జితేందర్‌రెడ్డి, ఎంపీఓ కేదారీశ్వర్, మత్స్యాద్రి చైర్మన్ కొమ్మారెడ్డి నరేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

జూనియర్ న్యాయవాదులకు వృత్తిపరమైన శిక్షణ ఇవ్వాలి

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

రామన్నపేట, మార్చి 20 : జూనియర్ న్యాయవాదులకు వృత్తిపరమైన శిక్షణ ఇవ్వాలని లాయర్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నర్రి స్వామి అన్నారు. మండల కేంద్రంలో న్యాయవాదులకు సంబంధించిన క్యాలెండర్‌ను గురువారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. పీపీలు, ఏపీపీల బదిలీలను మూడు సంవత్సరాల కోసారి నిర్వహించాలన్నారు.

కార్యక్రమంలో రామన్నపేట బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ గాలి లింగయ్య, ఐలు జిల్లా ఉపాధ్యక్షుడు మామిడి వెంకట్‌రెడ్డి, న్యాయవాదులు సుక్క శ్రవణ్‌కుమార్, డి.సత్తయ్య, ఎం.రమేశ్, డేవిడ్, రాందాస్, దినేశ్, మనోజ్, రమేశ్ పాల్గొన్నారు.

జౌళి శాఖ ఏడీ శ్రీనివాస్‌కు సత్కారం

జౌళి శాఖ ఏడీ శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న చేనేత నాయకులు

ఆలేరు టౌన్, మార్చి 20 : జౌళి శాఖ ఏడీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్‌ను కలెక్టర్ కార్యాలయంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత, ఆసు యంత్రం రూపకర్త చింతకింది మల్లేశం గురువారం సత్కరించారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన చేనేత లబ్ధిదారులకు అందజేయాలన్నారు. సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించి ఆప్కో ద్వారా వస్త్రాలు కొనుగోలు చేసి చేనేత కార్మికులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం ఆలేరు పట్టణ అధ్యక్షుడు గట్టు రాజు, ప్రధాన కార్యదర్శి మెరుగు శ్రీధర్, సిద్ధులు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు అందజేత

విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి

అడ్డగూడూరు, మార్చి 20 : మండలంలోని చౌళ్లరామారం జడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి విద్యార్థులకు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కొమ్మిడి ప్రభాకర్‌రెడ్డి గురువారం ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసి మంచి ఉత్తీర్ణత సాధించాలన్నారు. మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థికి రూ.3,016, ద్వితీయ రూ.2,016, తృతీయ ర్యాంకు సాధించిన విద్యార్థికి రూ.1,026 నగదు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దర్శనాల అంజయ్య, గ్రామస్తులు నర్సిరెడ్డి, కిరణ్, నవీన్‌కుమార్, నరేందర్ పాల్గొన్నారు.

చలో జనగామ పోస్టర్ ఆవిష్కరణ

ఆలేరు టౌన్, మార్చి 20 : చలో జనగామ పోస్టర్‌ను గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు అంబాల నారాయణ గురువారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జనగామ చౌరస్తాలో నిర్వహించే ఒక్కరోజు దీక్షను గౌడ కులస్తులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమితి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరి మహేందర్‌గౌడ్, నాయకులు సదానంద, అంజయ్య, మురళీధర్, మురళి, నరేశ్, సాగర్, కృష్ణ, వెంకటేశ్, నర్సయ్య, క్రాంతి గౌడ్ పాల్గొన్నారు.

రామన్నకు ఘన స్వాగతం

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు అడుగడుగునా జేజేలు

భూదాన్ పోచంపల్లి : కొత్తగూడెం వద్ద బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

భూదాన్ పోచంపల్లి : కొత్తగూడెం వద్ద కేటీఆర్ కోసం ఎదురుచూస్తున్న మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు

భూదాన్ పోచంపల్లి, మార్చి 20 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం హైదరాబాద్ నుంచి సూర్యాపేటకు వెళ్తుండగా.. భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో భూదాన్ పోచంపల్లి, బీబీనగర్, భువనగిరి మండలాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కొత్తగూడెం జాతీయ రహదారి వద్ద ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కేటీఆర్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాతో సత్కరించారు. అసెంబ్లీ సమావేశాల్లో చేనేత సమస్యలపై మాట్లాడాలని చేనేత నాయకులు వినతి పత్రం అందజేశారు. ఆ సమయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి వెళ్తుండడం చూసి పార్టీ శ్రేణులు కాంగ్రెస్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, రవీంద్రకుమార్, బూడిద భిక్షమయ్యగౌడ్, జడ్పీ మాజీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, నాయకులు మాడుగుల ప్రభాకర్‌రెడ్డి, పాక వెంకటేశ్‌యాదవ్, కందాల భూపాల్‌రెడ్డి, పాటి సుధాకర్‌రెడ్డి, సీత వెంకటేశ్, మల్లారెడ్డి, లింగస్వామి ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ఆధ్వర్యంలో ..

చౌటుప్పల్ : పట్టణంలోని బస్టాండ్ వద్ద బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్వాయి స్రవంతి, చింతల దామోదర్‌రెడ్డి, గిర్కటి నిరంజన్‌గౌడ్, పెద్దింటి బుచ్చిరెడ్డి, బొడ్డు శ్రీనివాస్‌రెడ్డి, ఢిల్లీ మాధవరెడ్డి, గుండెబోయిన ఆయోధ్య యాదవ్, సుర్వి మల్లేశం గౌడ్, గుండెబోయిన వెంకటేశం యాదవ్, ఊడుగు మల్లేశం గౌడ్, గోవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, బాల రాజు, పరమేశ్, వెంకట్‌రెడ్డి, బాల రాజు, పర్వతాలు యాదవ్, నర్సింహ గౌడ్, రమేశ్, మహేశ్వర్‌రెడ్డి, శేఖర్ గౌడ్, కృష్ణ యాదవ్, మహేశ్‌గౌడ్, వీరేశం పాల్గొన్నారు.

మాజీ సర్పంచుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడి సత్కారం

సంస్థాన్ నారాయణపురం : చౌటుప్పల్‌లో మాజీ సర్పంచుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ కేటీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు.

చౌటుప్పల్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు స్వాగతం పలుకుతున్న మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, పార్టీ శ్రేణులు

సంస్థాన్ నారాయణపురం : కేటీఆర్‌కు స్వాగతం పలికి పూల మొక్క అందజేస్తున్న మాజీ సర్పంచుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు యాదయ్యగౌడ్

విదేశీ విద్యానిధి పథకం దరఖాస్తు గడువు పెంపు

భువనగిరి కలెక్టరేట్, మార్చి 20 : 2024-25 విద్యా సంవత్సరానికి గాను అంబేద్కర్ విదేశీ విద్యానిధి పథకం (ఏఓవీఎన్) దరఖాస్తు గడువును పెంచినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి డీకే వసంతకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన ఎస్సీ విద్యార్థినీ, విద్యార్థులు విదేశాల్లో ఉన్నత చదువులకు ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు మే 19లోగా hups://telanganaepass.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ముగిసిన ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు

భువనగిరి అర్బన్, మార్చి 20 : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు గురువారం ముగిశాయి. చివరి రోజు కెమిస్ట్రీ-1, కెమిస్ట్రీ-2 పరీక్ష జరుగగా.. 5,326 మంది విద్యార్థులకు గాను 5,152 మంది హాజరయ్యారు. 174 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఇంటర్ నోడల్ ఆఫీసర్ రమణి తెలిపారు. జనరల్ విభాగంలో 4,281 మందికి గాను 4,201 మంది విద్యార్థులు హాజరయ్యారు. 80మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 1,045 మంది విద్యార్థులకు 951 మంది పరీక్ష రాశారు. 94మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

వివాహిత ఆత్మహత్య

చౌటుప్పల్, మార్చి 20 : మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. తంగడపల్లి గ్రామానికి చెందిన బుంగపట్ల స్వప్న (28) ఇతరులతో తరుచూ సెల్‌ఫోన్‌లో మాట్లాడుతుందని ఆమె భర్త మహేశ్ గురువారం మందలించాడు. అనంతరం అశోక్ వృత్తి రీత్యా డ్రైవర్ కావడంతో డ్యూటీకి వెళ్లాడు. ఆ తర్వాత ఇంట్లో ఎవరూ లేని సమయంలో స్వప్న ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి మామ మల్లేశ్ గమనించి ఇరుగు పొరుగు వాళ్లకు సమాచారం ఇచ్చాడు. చౌటుప్పల్ ప్రభుత్వ దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి తల్లి రేణుక ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల పూర్తి కారణాలు తెలియరాలేదు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

వలిగొండ, మార్చి 20 : మండలంలోని కంచనపల్లి గ్రామ పరిధిలో అక్రమంగా నిల్వ చేసిన 10క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు గురువారం సీజ్ చేశారు. తుర్కపల్లి మండలం మల్కాపురం గ్రామపంచాయతీ పరిధిలోని బిలయ్యతండాకు చెందిన గుగులోతు రాములు తక్కువ ధరకు రేషన్ బియ్యం కొనుగోలు చేసి అక్రమ వ్యాపారం చేస్తున్నాడని ఎస్ఐ యుగంధర్ తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు చెప్పారు.

అర్హులైన 2వేల మందికి ఇండ్ల పట్టాలు ఇవ్వాలి : సీపీఐ

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి శ్రీరాములు

భువనగిరి అర్బన్, మార్చి 20 : పట్టణంలో నిరుపేదలు, అర్హులైన 2వేల మందికి ఇండ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భువనగిరి పట్టణానికి సమీపంలో ప్రభుత్వ భూములు ఖాళీగా ఉన్నాయని, అందులో అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని అన్నారు. ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం మార్చి నెలాఖరు వరకు సర్వే చేయించి పట్టాలు ఇప్పించి హామీని నెరవేర్చాలని కోరారు. పట్టణంలో ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు రూ.100 కోట్లు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏశాల అశోక్, పట్టణ కార్యదర్శి పుట్ట రమేశ్, నాయకులు దాసరి లక్ష్మయ్య, అభిలాశ్, పెంటయ్య, సత్తయ్య, వెంకట్‌రెడ్డి, స్వామి, శంకర్ పాల్గొన్నారు.

ఇంటి పన్ను వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయని అధికారులపై చర్యలు తీసుకోవాలి : సీపీఎం

బీబీనగర్, మార్చి 20 : సొంత ఇండ్ల నిర్మాణం చేసుకొని ఇంటి, ఆస్తి పన్ను చెల్లిస్తున్న వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయని గ్రామపంచాయతీ కార్యదర్శి, ఇతర అధికారులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కోమటిరెడ్డి చంద్రారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పన్ను చెల్లింపు వివరాలను అన్‌లైన్‌లో నమోదు చేయాలని గతంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఆరు నెలల నుంచి ఆఫీసుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా బీబీనగర్‌లోని ఇందిరమ్మ కాలనీ, లెప్రసీ కాలనీ, రంగాపురంలో పలువురి వివరాలను రివిజన్ రికార్డులో (ఆఫ్ లైన్) నమోదు చేస్తున్నారని, ఆన్‌లైన్‌లో నమోదు చేయట్లేదని తెలిపారు. కలెక్టర్, పంచాయతీరాజ్ కమిషనర్లు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. పంచాయతీరాజ్ చట్టం రాష్ట్రమంతా ఒక విధంగా, బీబీనగర్‌లో మరో విధంగా అమలు చేయడం ఏమిటని ప్రశ్నించారు.

గ్రామపంచాయతీ అధికారులు అవినీతికి పాల్పడుతూ ఇందిరమ్మ కాలనీ పక్కనే ఉన్న ఓ ప్రైవేటు వెంచర్‌లో ఖాళీ ప్లాట్లకు ఇంటి నెంబర్లు ఇచ్చి రిజిస్ట్రేషన్లు చేయించుకునేందుకు సహకరించారని తెలిపారు. వాటి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారని పేర్కొన్నారు. పేదలు, సామాన్యుల పట్ల వివక్ష చూపుతూ అవినీతికి పాల్పడిన సంబంధిత గ్రామపంచాయతీ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టాలి : సీపీఎం

పిలాయిపల్లి రోడ్డుపై నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

భూదాన్ పోచంపల్లి, మార్చి 20 : మండలంలోని పిలాయిపల్లి నుంచి పెద్దగూడెం, జూలూరు వరకు రోడ్డు గుంతలమయంగా మారిందని, వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు మంచాల మధు, గూడూరు బుచ్చిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. పార్టీ ఆధ్వర్యంలో గురువారం జూలూరు, పెద్దగూడెం, పిల్లాయిపల్లి రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాలు వచ్చినప్పుడు వరి పొలాల్లోని నీళ్లు రోడ్డు మీదికి వస్తుండడంతో దెబ్బతింటుందన్నారు. మండలంలో దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కోరుతూ ఈ నెల 26న పెద్దరావులపల్లి నుంచి పోచంపల్లి వరకు నిర్వహించే పాదయాత్రను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం గ్రామ శాఖ కార్యదర్శి పత్తి భిక్షపతి, నాయకులు భిక్షపతి, నర్సింహ, మల్లారెడ్డి, రమేశ్, విక్రమ్, బాలయ్య పాల్గొన్నారు.

సీపీఎం నాయకుడు గోపి వర్ధంతి

చౌటుప్పల్ రూరల్, మార్చి 20 : మండలంలోని జైకేసారం గ్రామంలో సీపీఎం నాయకుడు తిరందాసు గోపి వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్మారక స్తూపం వద్ద నివాళి అర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకుడు బూరుగు కృష్ణారెడ్డి, స్థానిక నాయకులు గంగాదేవి సైదులు, రాగీరు కృష్ణయ్య, పొట్ట శ్రీనివాస్, బోదాసు వెంకటేశ్, పల్లె మధుకృష్ణ, దొడ్డి లింగస్వామి, మాదగోని మారయ్య పాల్గొన్నారు.

గోపి స్మారక స్తూపం వద్ద నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు

మానవ అక్రమ రవాణా నియంత్రణపై అవగాహన

సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం కిరణ్

ఆత్మకూరు(ఎం), మార్చి 20 : మానవ అక్రమ రవాణా నియంత్రణపై మండల కేంద్రంలోని మహిళా సమైక్య కార్యాలయంలో గురువారం అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏపీఎం కిరణ్ మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులు గ్రామాల్లోని ప్రజలకు మానవ అక్రమ రవాణా నియంత్రణపై అవగాహన కల్పించాలన్నారు. సమాజంలో ఆడ, మగ తేడా లేకుండా సమానంగా పెంచడంతో పాటు మంచి విద్యను అందించాలన్నారు. సమావేశంలో సీసీలు వెంకన్న, భాస్కర్, మహిళా సమైక్య మండల అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మి, సుజాత, కోశాధికారి పావని, వివిధ గ్రామాల వీఓఏలు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- విద్యార్థులకు అల్ ది బెస్ట్ చెప్పిన కలెక్టర్

భువనగిరి కలెక్టరేట్, మార్చి 20 : నేటి నుంచి జరుగనున్న పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. ఎంఈఓలు, పరీక్ష సెంటర్ల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లతో కలెక్టర్ గురువారం జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పదో తరగతి పరీక్షలు 8,632 మంది విద్యార్థులు రాస్తున్నారని, వారికోసం 50 సెంటర్లు ఏర్పాటు చేశామని అన్నారు. పరీక్షల నిర్వహణకు చీఫ్ సూపరింటెండెంట్లు 50 మంది, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు 50మంది, ఇన్విజిలేటర్లు 576 మందిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పరీక్షలు సాఫీగా నిర్వహించేలా చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లకు తగిన సూచనలు ఇచ్చామన్నారు. జూమ్ మీటింగ్‌లో డీఈఓ సత్యనారాయణ, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామ్స్ రఘురాంరెడ్డి, వివిధ మండలాల విద్యాధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఆత్మీయతకు ప్రతీక ఇఫ్తార్ విందు : కలెక్టర్

కలెక్టర్ హనుమంతరావుకు స్వీట్ తినిపిస్తున్న మైనార్టీ నాయకులు

భువనగిరి అర్బన్, మార్చి 20 : రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లింలకు ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు ముస్లింల ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీక అని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. టీఎన్‌జీఓ భవన్‌లో ఆ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముస్లింలు అతి పవిత్రంగా జరుపుకొనే పండుగ రంజాన్ అన్నారు. పేద ముస్లింలు సంతోషంగా జరుపుకొనేందుకు దాతలు సహకరించడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీఎన్‌జీఓ జేఏసీ చైర్మన్ మందడి ఉపేందర్‌రెడ్డి, టీజీఓ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌ప్రసాద్, సెక్రటరీ ఖదీర్, నాయకులు శ్రీకాంత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విపత్తులు ఎదురైనప్పుడు సమాజానికి సమర్థవంతంగా సేవలందించాలి

- ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వికాస్ భాటియా

విపత్తు నిర్వహణపై అవగాహన కల్పిస్తున్న అభియాన్ కమిటీ సభ్యులు

బీబీనగర్, మార్చి 20 : విపత్తులు ఎదురైనప్పుడు సమాజానికి సమర్థవంతంగా సేవలందించాలని ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ వికాస్ భాటియా అన్నారు. మండలంలోని బీబీనగర్ ఎయిమ్స్‌లో స్వచ్ఛతా అభియాన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం విపత్తు నిర్వహణపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛతా అభియాన్ కమిటీ సంసిద్ధత, ప్రతిస్పందన సామర్థ్యాలను పెంపొందించే లక్ష్యంతో మూడు రోజుల విపత్తు నిర్వహణ వర్క్‌షాప్‌ను విజయవంతంగా నిర్వహించామన్నారు. సుమారు 45మంది అధ్యాపకులు, నర్సింగ్ అధికారులు ఈ సమగ్ర శిక్షణలో పాల్గొన్నట్లు తెలిపారు. విపత్తు నిర్వహణ సమయంలో అత్యవసర పరిస్థితులను అనుకరించడానికి శిక్షణతో సహా ఆచరణాత్మక సెషన్లపై అవగాహన కల్పించామన్నారు. ఆకస్మిక పరిస్థితులు ఏర్పడినప్పుడు హాస్పిటల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్లాన్ కోసం ఈ వర్క్‌షాప్ ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అభిషేక్ అరోరా, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ విశాఖ జైన్, డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

దివ్య